సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఈ బైక్ ఎవరిది?



ఆర్పీపేట ఉన్నత పాఠశాల రక్షణగోడకు ఆనుకుని వదిలేసిన బైక్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచర పాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకుని తుప్పుపట్టిన బైక్ నిర్లక్ష్యంగా వదిలేశారు. పాఠశాల ప్రధాన ద్వారానికి ఆనుకుని బైక్ ఉండడంతో అటుగా వెళ్లే విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది బైక్ పార్కింగ్ చేసిన ప్రాంతంలో రోడ్లు ఊడ్చకపోవడంతో అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల రక్షణగోడకు ఆనుకుని మురుగు నిలిచిపోయింది. దోమలు చేరి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. బైక్‌ను తరలించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు మూడే వినతులు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బి.రాము వినతులను స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణ శిబిరానికి హాజరైన బీఎల్‌వోలు

మహారాణిపేట: వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ కోసం జిల్లా యంత్రాంగం సమయాత్తమవుతోంది. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్ర అధికారుల(బీఎల్‌వో) శిక్షణ కార్యక్రమాల కు శ్రీకారం చుట్టింది. నాలుగు రోజుల పాటు వివిధ అంశాలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. విశాఖ దక్షిణ, తూర్పు, ఉత్తర, పశ్చిమ, భీమిలి, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని బీఎల్‌వోలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన శిక్షణ శిబిరాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు లచ్చాపాత్రుడు, మధుసూదనరావు, డీటీ జిలానీ తదితరులు పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ఎస్సీకాలనీలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రామ్ జీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పి.గణబాబు, అంగ దుర్గాప్రశాంతి మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ గొప్ప ఉద్యమ నాయకుడిని కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో నాయకులు ఎం.వి.గిరి,పెద్దాడ హరికృష్ణ,ముప్పిడి రుషికుమార్, కాకర గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గంట్యాడ గోవింద్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఘనంగా గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవాలు

గోపాలపట్నం: గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవాల రెండో సభ సోమవారం గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని రచయిత విశాలాక్షి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సాహిత్యానికి తొలి గురువు శంకరాచార్యులని అన్నారు. ఆదిత్య కళాశాల తెలుగు అధ్యాపకుడు మల్లాది సోమేశ్వరరావు పలు సాహిత్య ప్రక్రియల గురించి వివరించారు. గ్రంథాలయాధికారి ఎన్వీ నరసింహం ఆధ్వక్షతన జరిగిన కార్యక్రమంలో సీహెచ్ సూర్యనారాయణ, చందు సుబ్బరావు, నెహ్రూ యువ కేంద్రం విశ్రాంత కోఆర్డినేటర్ రామప్రసాద్, రామదాసు, అప్పారావు పాల్గొన్నారు.

ఆకతాయిల అడ్డా కొత్తపాలెం



ఆకతాయిలకు కొత్తపాలెం అడ్డగా మారుతోంది. పలుమార్లు ఇక్కడ గంజాయి, డ్రగ్స్, బహిరంగా మద్యపానం.. పేకాట వంటి కేసులు బయట పడ్డాయి. అయినా పోలీసులు పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో ఇప్పుడు వారి ఆగడాలు శృతి మించాయి. రోడ్డుపైకి ఎక్కాయి. మొన్న మందుబాబులు, ఆకతాయిలు స్థానికులను ఇబ్బంది పెట్టిన ఘటన మరవక ముందే యువకులు కత్తులతో దాడులు చేసుకోవడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

\- గోపాలపట్నం

- వరుస ఘటనలతో బెంబేలెత్తిస్తున్న ప్రజలు
- గంజాయి, మందుబాబుల ఆగడాలు
- పలు మార్లు గంజాయి పట్టుబడిన వైనం
- కొత్తపాలెం శివారు ప్రాంతాలే వీరి డెన్లు
- పోలీసులే భయపడుతున్నారని చెబుతున్న స్థానికులు
- పటిష్టమైన చర్యలు చేపట్టాలని వేడుకోలు



ఆదివారం రాత్రి కత్తి దాడి జరిగిన ప్రాంతం



కొత్తపాలెం జంక్షన్‌లో గతేడాది పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)



కొత్తపాలెం ప్రధాన రహదారి

నగరానికి శివారు ప్రాంతం కావడం.. ఇక్కడ ఖాళీ స్థలాలు, తోటలు ఉండడంతో ఆకతాయిలు ఈ ప్రాంతానికి చేరుతున్నారు. గంజాయి, మద్యం సేవిస్తున్నారు. ఈ ప్రాంతంలో 110కిలోల గంజాయిని గతేడాది టాస్క్‌ఫోర్స్, గోపాలపట్నం పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. అంతక ముందు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పెందుర్తి పోలీసులు గంజాయి పట్టుకున్నారు. అలాగే చంద్రనగర్ ప్రాంత వాసి డ్రగ్స్‌తో దొరికాడు. దీనిపై గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఇక్కడి యువకులు మాదక ద్రవ్యాల వినియోగానికి కొత్తపాలెం కేంద్రంగా మార్చుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డెన్లకు నేతల అండ

స్థానిక టీడీపీ నాయకుల అండదండలతో మద్యం, పేకాట డెన్లు నడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల కాలంలో రెండు మార్లు అరెస్ట్ చేయడం దీనికి బలం చేకూరుతోంది. అయినా నేతల అండదండలు ఉండడంతో పేకాట డెన్లు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీరి వల్ల యువకులు గంజాయి, మద్యం వంటి వాటికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక జోన్లుగా ..

మద్యం, గంజాయి వంటివి సేవించేందుకు కొత్తపాలెంలో కొన్ని శివారు ప్రాంతాలను జోన్లుగా మార్చుకున్నారు. సాయంత్రం అయిన తర్వాత ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు స్థానికులే భయపడుతున్నారు. ఎల్లపువానిపాలెం శివారు రైల్వే మదాల వద్ద మద్యం, గంజాయి వంటివి సేవించేవారు ఎక్కువగా ఉంటారని, అలాగే సంతోష్‌నగర్ సంతోష మాతా ఆలయం శివారు ప్రాంతంలో ఆకతాయిలు మద్యం సేవిస్తుంటారని చెబుతున్నారు. వీరిని అడ్డుకునే ప్రయత్నం చేసే వారిపై దాడులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు.

భయాందోళనకు గురవుతున్న స్థానికులు

ఆదివారం రాత్రి మద్యం, గంజాయి సేవించి కత్తితో దాడి చేసిన ఘటన భయాందోళనకు గురి చేస్తోందని కొత్తపాలెం వాసులు వాపోతున్నారు. గతంలో భగత్ సింగ్ నగర్ వద్ద ఇదే విధంగా దాడులు చేసుకున్న ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. ఆ ఘటనను మర్చి పోతున్న సమయంలో కొత్తపాలెం గరవ రామాలయం వద్ద యువకులు దాడికి పాల్పడి ఘటన మరింత ఆందోళకు గురి చేస్తోందని వాపోతున్నారు.

నిఘా పెట్టాలని వేడుకోలు

పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆకతాయిలు, మందుబాబులకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా బహిరంగంగా మద్యం సేవించేవారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు బెల్ట్ దుకాణాలను సైతం అరికట్టాలని వేడుకుంటున్నారు. కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, చంద్రగనగర్ ప్రాంతాల్లో బెల్టు షాపుల్లో జోరుగా అమ్మకాలు చేస్తున్నారు. కొందరు మొబైల్ సర్వీసు ద్వారా మద్యం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరిని చాకచక్యంగా పట్టుకుని నిరోధించాలని కోరుతున్నారు. డ్రోన్లు ఉపయోగించి తాగుబోతులపై కఠిన చర్యలు చేపట్టి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

మిగులు భూములు నిర్వాసితులకే...

వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాసితులు



నిర్వాసితుల ఐక్యవేదిక సభలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం వినియోగించగా మిగులు భూములను తిరిగి రైతులకు అప్పగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. 16 నిర్వాసిత కాలనీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం 85వ వార్డు పెదమడక మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. భూములు తిరిగి ఇవ్వని పక్షంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా ప్యాకేజీ ఇవ్వాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అందించేంత వరకు ప్రతీనెలా జీవన భృతిగా నెలకు రూ.25వేలు ప్రతీ నిర్వాసితునికి అందివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్, పీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కొండారెడ్డి మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కులో ఉపాధి దొరుకుతుందనే ఆశతో భూములు ఇస్తే ఆ భూములపైనే కన్నేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలు గద్దాల్లా తన్నుకుపోవాలని చూస్తున్నారన్నారు. దీన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రతినిధి వి.ఎస్.కృష్ణ, లీడర్ పత్రికా సంపాదకుడు పి.రమణమూర్తి, 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) మాట్లాడుతూ రాష్ట్రానికి వెన్నెముకలాంటి విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసి ఉద్యోగులను తగ్గించి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సొమ్మును ఉక్కు ఖాతాలో జమచేసి ఆ సొమ్ముతో స్వచ్ఛంద పదవీ విరమణ చేయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు విందుల చిరురాజు, గళ్లా రామకృష్ణ, ఎం.వెంకటేష్, చిన్నారావు, అప్పలరాజు, బళ్ల పైడిరాజు, బీ.నారాయణరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రనగర్‌లో అగ్ని ప్రమాదం



మంటలు వచ్చిన తీరును పరిశీలిస్తున్న ఫైర్ సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల విలువైన గృహోపకరణాలు,వస్తువులు పత్రాలు దగ్ధమయ్యాయని బాధితులు చెబుతున్నారు. చంద్రనగర్‌లో రఘు, భార్య కల్యాణి, తల్లి రాజేశ్వరితో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. భార్యా భర్తలిద్దరూ ప్రైవేటుగా ఉద్యోగాలు చేస్తున్నారు. తల్లి ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం రాజేశ్వరి ఇంట్లో ఉండగా విద్యుత్ మీటర్ వద్ద పొగలు రావడంతో స్థానికులకు తెలియజేసింది. అయితే అది గమనించే సరికే మంటలు వ్యాపించడంతో ఇంట్లో గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మర్రిపాలెం ఫైర్ సిబ్బంది వచ్చే సరికి నష్టం జరిగి పోయిందని బాధితులు వాపోయారు. ఫైర్ అధికారులు వివరాలు సేకరించి నష్టాన్ని అంచనా వేశారు. ఇంట్లో ఫ్రిడ్జ్, టీవీ, వాషింగ్ మిషన్ వంటి పలు గృహోపకరణాలు, ముఖ్యమైన దస్త్రాలు దగ్ధమయ్యాయని వాపోయారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



శిక్షణలో పాల్గొన్న బీఎల్‌వోలు

విశాఖ విద్య: ఓటరు జాబితా రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశ్చిమ నియోజకవర్గ ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ సూచించారు. ఓటరు జాబితా తయారీపై పశ్చిమ నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు 52 వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాలులో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. నియోజక వర్గంలోని 221 మంది బీఎల్వో లకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చేలా, రోజుకు 50 మంది శిక్షణకు హాజరయ్యేలా షెడ్యూల్ సిద్ధం చేశామన్నారు. మాస్టర్ ట్రైనర్స్ పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. ఓటరు జాబితాల తయారీ, చేర్పులు, మార్పులు వంటి విషయాల్లో బీఎల్‌వోలు ఏ విధంగా వ్యవహరించాలన్న దానిపై ట్రైనర్స్ అవగాహన కల్పించారు. ఈనెల 11 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని డీటీ విజయ్ కుమార్ తెలిపారు. బీఎల్‌వోలు ఏ మేరకు విషయ పరిజ్ఞానం పొందారనే దానిపై ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: క్రైస్తవ సంఘాలను సమన్వయం చేసి, క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎన్ఏడీ యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంఘాల లీగల్ అడ్వైజర్ బీఎస్ కృష్ణ (ఆల్ఫా కృష్ణ) అన్నారు. చర్చి ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర గల ఎన్ఏడీ యునైటెడ్ క్రైస్ట్ చర్చి విశాఖ జిల్లాలో మూడు ప్రాంతాల్లో విస్తరించిందన్నారు. ఘన చరిత్ర గల సంఘానికి తనను లీగల్ అడ్వైజర్‌గా నియమించడం ఎంతో ఆనందానిస్తుందన్నారు. కమిటీ సభ్యులతో మమేకమై ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌యూను ప్రభుత్వమే నడపాలి

సీపీఎం డిమాండ్



ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని జీవీఎంసీ 30 పడకల ఆస్పత్రి(ఎఫ్ఆర్‌యూ)ని రాష్ట్ర ప్రభుత్వమే నడపాలని..., కోరమాండల్ యాజమాన్యానికి అప్పగించి రోగుల కోపానికి గురికావద్దని సీపీఎం నాయకులు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు,సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్‌యూను కోరమాండల్ యాజమాన్యానికి అప్పగించాలని ఎమ్మెల్యే పి.గణబాబు చేస్తున్న యత్నాన్ని సీపీఎం నాయకులు వ్యతిరేకించారు. ఈ అంశంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం ధర్నా చేశారు. పేదల పాలిట సంజీవినిగా పిలిచే జీవీఎంసీ 30 పడకల ఆస్పత్రి నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కల్పించి,పేద రోగులకు అండగా నిలవాల్సింది పోయి కోరమాండల్ యాజమాన్యానికి అప్పగించి చేతులు దులుపుకుందామని పాలకులు ఆలోచన చేయడం దారుణం అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో సరైన వైద్యశాల లేదని,ఇక్కడ గల ఎఫ్ఆర్‌యూను వంద పడకల ఆస్పత్రిగా మార్చిఅవసరమైన వైద్య నిపుణులను, వసతులను సమకూర్చాలని డిమాండ్ చేశారు.అలాగే ఇక్కడ పని చేస్తున్న 17 మంది వైద్య సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావు,ఆర్.విమల,వరలక్ష్మి,సత్యారావు,జ్యోతి,వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌యూలో ఉచిత సేవలు అందించాలి

జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ సురేష్ వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: తన వార్డు పరిధిలోని జీవీఎంసీ 30 పడకల ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యూ)ని కోరమాండల్ యాజమాన్యానికి అప్పగించాలనే పాలకులు ఆలోచన చేయడం దారుణమని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను ఆయన సోమవారం కలిసి సమస్యను నేరుగా వివరించారు. ఆయన మాట్లాడుతూ కోరమాండల్ యాజమాన్యం ఎఫ్ఆర్‌యూ నిర్వహణ బాధ్యతలు తీసుకుని, రోగుల దగ్గర నుంచి ఫీజులు వసూలు చేయాలనే ఆలోచనలో ఉందన్నారు. ఈ ప్రతిపాదనను జీవీఎంసీ అధికారులతో పాటు పాలకులకు పంపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కోరమాండల్ పరిశ్రమ నుంచి నిత్యం వస్తున్న కాలుష్యాన్ని తమ వార్డు ప్రజలతో పాటు పారిశ్రామిక ప్రాంత ప్రజలు పీల్చి అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. తమ ప్రాంత వాసులకు కోరమాండల్ సంస్థ ఉచిత వైద్య సేవలు అందించాల్సింది పోయి, ఫీజులు వసూలు చేసి వైద్యం చేస్తామంటే అంగీకరించబోమన్నారు. కోరమాండల్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలను స్థానిక వాసులకు కాకుండా తమిళనాడు వాసులకు కల్పిస్తున్నారు ఆరోపించారు. ప్రజలకు మేలు జరిగేలా ఉచితం వైద్యం అందించాలని కోరారు.

నష్టపరిహారం ఇప్పించండి మహాప్రభో..



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్జీ పాలిమర్స్ బాధితులు

మహారాణిపేట: ఎల్జీ పాలిమర్స్‌లో గ్యాస్ లీక్ ఘటనలో నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఈ ఫిర్యాదును స్వీకరించకపోవడంతో బాధితులంతా కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో మొత్తం 186 మందికి సహాయం అందించాల్సి ఉందని, ఐదేళ్లు దాటుతున్న ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఎంతో మందికి ఇచ్చారని, ఎల్జీ పాలిమర్స్ సమీపంలోని వెంకటాపురం తదితర గ్రామాల్లో నివసిస్తున్న తమకు ఇవ్వలేదని, తక్షణం ఇవ్వాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి, గ్రామాల్లో ఉన్న వారికి రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందించారని, నేటి వరకు ఈ 186 మందికి ఎలాంటి సహాయం అందలేదని వాపోయారు. గతంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని, ఎలాంటి పరిష్కారం కాలేదని బాధితులు వివరించారు.

సమ్మె విజయవంతానికి బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న అఖిలపక్ష ట్రేడ్ సంఘాల నాయకులు

సింథియా: ఈ నెల 9న నిర్వహించేబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం అఖిలపక్ష ట్రేడ్ సంఘాల ఆధ్వర్యంలో సింథియాలోని పైప్‌లైన్ జంక్షన్ నుంచి గాజువాక జింక్ గేటు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు భోగవిల్లి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సత్యాంజనేయ, కసిరెడ్డి సత్యనారాయణ, గుడాల రాంబాబు, సీఐటీయూ నాయకులు లక్ష్మణమూర్తి, పైడిరాజు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో స్వచ్ఛత పక్షోత్సవాలు ప్రారంభం



హెచ్‌పీసీఎల్‌లో ఏర్పాటు చేసిన వీధి నాటకాన్ని తిలకిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: నగర ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. హెచ్‌పీసీఎల్, జీవీఎంసీ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ ప్రధాన కార్యాలయం వద్ద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కృష్ణన్, సీజీఎం(హెచ్ఆర్) గంటా కిరణ్‌కుమార్‌తో కలిసి కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ ధ్యేయంగా, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర గమ్యంగా, స్వచ్ఛ విశాఖ లక్ష్యంగా హెచ్‌పీసీఎల్ సామాజిక బాధ్యతతో విశాఖ నగర పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, నగరాభివృద్ధి దిశగా ప్రజల అవగాహనకు జీవీఎంసీతో కలిసి చేపట్టిన కార్యకరమాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో మల్కాపురం ప్రాంతాన్ని దత్తత తీసుకొని ఆ ప్రాంతంలో పార్కులు, రోడ్లు, స్ట్రీట్ లైటింగ్, సెంటర్ మీడియన్లు, బ్యూటిఫికేషన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు. మల్కాపురం ప్రాంతం, కాలనీల్లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా పర్యావరణహిత వస్తువులు ప్రజలకు అందుబాటులో లభించేలా శాశ్వతంగా స్టాల్‌ను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కృష్ణన్ మాట్లాడుతూ విశాఖ నగరంలో హెచ్‌పీసీఎల్ ప్రతి సంవత్సరం స్వచ్ఛ విశాఖ అభివృద్ధి, విశాఖ నగర పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రజల అవగాహనకు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు జీవీఎంసీతో కలిసి 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. జీవీఎంసీ అన్ని జోన్లలో ప్రచారం కోసం 8 స్వచ్ఛ రథాలు, నాలుగు బృందాలతో వీధి నాటకాలు, ఒక పప్పెట్ షో బృందం, 3 ఎఫ్ఎం రేడియోల ద్వారా బ్రాడ్ కాస్టింగ్ కార్యక్రమాలు, నగరంలో 12 పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



డీఈవోకు వినతి పత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

విశాఖ విద్య: ఉచిత విద్య అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్ఏడీ భాష్యం స్కూల్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌తో పాటు డీఈవో ప్రేమ్‌కుమార్ కూడా తల్లిదండ్రులు వినతి పత్రం అందజేశారు. ఉచిత విద్య పథకం కింద చేరిన తమ పిల్లలను పైతరగతులకు ప్రమోట్ చేయాలంటే ఫీజు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫామ్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాల కోసం తాము కట్టిన ఫీజులు తిరిగి ఇప్పించాలని విన్నవించారు. ది పేరెంట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వెస్ట్ జోన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్య హక్కు చట్టం ప్రకారం ఫ్రీ సీటు పొందిన విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాల యాజమాన్యానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

డిఫెన్స్ మద్యంతో వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన డిఫెన్స్ మద్యంతో పోలీసులు

మహారాణిపేట: నగరంలో అనధికారికంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని దగ్గర నుంచి 41 వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల మద్యం బాటిళ్లు సేకరించి అధిక ధరలకు విక్రయిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో మల్కాపురం ప్రకాష్ నగర్ దగ్గర మద్యం బాటిళ్లు విక్రయించేందుకు ప్రయత్నించిన ఐతంశెట్టి ఉదయ్ కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్ఐ ఎస్.ముసలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.